# నీలాటిరేవు

విశాలాక్షమ్మ రోజూకంటె ముందుగానే నీళ్ళకోసం రేవులోకి వచ్చింది. ఆవిడ ముఖంలో సంతోషం తాండవమాడుతోంది. అంతేకాదు! ఆ సంతోషంలో గర్వంకూడ మిళితమైందని వేరే చెప్పక్కర్లేదు.

రేవులో ఉన్న అమ్మలక్కలందరూ విశాలాక్షమ్మను చూసి ఆశ్చర్యపోయారు. రోజూ పొద్దెక్కిన తర్వాత వచ్చే విశాలాక్షమ్మ యివాళ యింత తొందరగా రావడములో ఏదోవిశేషం ఉండితీరా లనుకున్నారంతా.

ఆవిడ చరచరా రావడంతోనే, "చూశావుటే? చుక్కమ్మా! ఎంత విడ్డూరమో?" అనగానే చుక్కమ్మ "ఏమిటే? ఏమిటే? ఏం జరిగిందక్కా?" అనే ప్రశ్న పూర్తిగాక ముందే మిగతా అమ్మలక్కలు తమ తమ పనులు మరచిపోయి, అసలు విషయమేమిటో విందామని చెవులు రిక్కించి, తహతహ లాడుతున్న సమయంలో యీవిధముగా మొదలుపెట్టింది, విశాలాక్షమ్మ.

## "పవన్"

"ఏమని చెప్పను చుక్కమ్మా! ఈ నోటి తోటి ఆపాడువిషయాలు చెప్పితే, గంగలో దూకినా పాపాలు పోవంటే నమ్మ!"

"ఇంతకీ ఏం జరిగిందక్కా?"

"జరగటానికేముంది? ఆ మంగమ్మలేదూ! నా అంత గొప్పది లేదని మిడిసిపడి పోతో వుంటుంది, తెలీదూ? దానికూతురు లేదూ? ముండమోసిన కూతురు! అది ఏ తురకవాడితోనో పోయినరాత్రి లేచి పోయిందట!"

అమ్మలక్కలంతా ముక్కుమీద వేలేసుకున్నారు.

"దానికేం పొయ్యే కాలం వచ్చిందగో!" అంది చుక్కమ్మ.

"దానికి పొయ్యేకాలం ఎప్పుడో వచ్చింది. వాడితో లేచిపోదామని ఎప్పటినించో కలలు కంటోంది."

"ఇంతకీ కాలం మారిపోయిందమ్మా! లేకపోతే ఇంత ఘోరమా?" అంది రంగమ్మ.

"రంగమ్మక్కా కాలం మారిపోయిందంటే నేనొప్పుకోను. అంతా సరిగ్గానే లేరూ? అందరూ మంగమ్మ కూతురులాగే లేచిపోతున్నారా?"

విశాలాక్షమ్మకి ఎదురుచెప్పే ధైర్యం, శక్తి ఎవరికీ లేదు. ఒకవేళ ఎదురుచెప్పితే ఆ విసురు వీళ్ళమీదకి తిరుగుతుందేమోనని భయం. అందుకనే అందరూ ఆవిడ మాటకి తందానతాన కొట్టారు.

"నేనప్పుడే అనుకున్నాను. ముండమోసిన దానికి ఆబోట్టేమిటి? ఆ అలంకారాలేమిటి? మా ఆయన పోగానే జుట్టు తీయించి నన్నొకమూల కూర్చోపెట్టలేదూ!" అని ఇంకా ఏవేవో చెప్తూంటే "ఇంతకీ రోజులు మారిపోయాయమ్మా! పాపిష్టి రోజులు!" అని అందామని నోటిదాకా వచ్చింది రంగమ్మకి, కాని ఊరుకుంది. దోషమంతా కాలంమీద రుద్దటమంటే విశాలాక్షమ్మ కిష్టము లేదు. దోషమంతా మంగమ్మ కూతురిదే అంటుంది.

నీలాటి రేవులో నలుగురూ నాలుగువిధాలుగా మంగమ్మ కూతురుగురించి ఆడిపోసుకున్నారు.

రేవునించి సంతోషాతిశయంతో విశాలాక్షమ్మ యింటిదారిపట్టింది.

* * *



విశాలాక్షమ్మకి మంగమ్మకూతురంటే తగని అక్కసు. ఆ అక్కసు తీర్చుకోటానికి సమయం దొరికిందని సంతోషపడింది.

ఇంతకీ విశాలాక్షమ్మకి మంగమ్మ కూతురంటే అంతద్వేషం ఎందుకో ఎవరికీ తెలియదు. కాని కారణం లేకపోలేదు. తన మనుమడు శేఖరానికీ, మంగమ్మ కూతురికీ ఏదో సంబంధం ఉందని ఎవరో చెప్పారు. తర్వాత తర్వాత ఆ అనుమానం స్థిరపడిపోయింది. కొడుకుతో ఎన్నోసార్లు చెప్పింది. "నాయనా! శేఖరానికి త్వరగా పెళ్ళిసంబంధం చూడరా. వాడు అనవసరంగా చెడిపోతున్నాడు" అని.

మంగమ్మ కూతురంటే తనకి తగని మంట! ఆ మంట యివ్వాళ ప్రొద్దున్నే చల్లారింది. పీడవదిలింది. ఆవిడ హృదయం తేలికయింది.

ఆవిడ చాలారోజులుగా భగవంతుణ్ని ప్రార్థించింది "హే! భగవంతుడా! యీ ముండమోసినదాని బారినుండి నామనమణ్ని రక్షించు!" అని. చివరికి భగవంతుడు రక్షించాడు. అంతకంటే తనకు కావలసినదేముంది?

రేవునించి యింటికివస్తూ ఆలోచించింది. మంగమ్మ కూతుర్ని తిట్టటం పొరపాటనుకుంది. మంగమ్మకూతురు ఎవరితోనో లేచిపోయి, తన హృదయంలోని భారాన్ని తగ్గించింది. నిజంగా దానికి చెయ్యెత్తి దండం పెట్టవచ్చు ననుకుంది.

* * *

పోయిన రాత్రి రెండో ఆట సినిమాకి వెళ్ళుతున్నానని శేఖరం యింటినించి బయలుదేరాడు. రాత్రిరాలేదు. తెల్లారినా రాలేదు

విశాలాక్షమ్మ నీళ్ళబిందెతో యింట్లో అడుగుపెడుతో "ఏమ్మరా! శేఖరం వచ్చాడా?" అని అడగడం తడవుగా అంతా గొల్లుమన్నారు. శేఖరం రాత్రి యింట్లోంచి బయలుదేరేటప్పుడు ఉత్తరంరాసి బల్లమీద పెడితే, అది పొద్దున్న చదువుకున్నారట!

"అప్రాచ్యుడు! వంశానికి అప్రతిష్ఠ తీసుకువచ్చాడు" ఇంకా ఏవేవో గొణగటం మొదలుపెట్టింది విశాలాక్షమ్మ.

శేఖరం తిరిగిరాలేదు.

విశాలాక్షమ్మ మర్నాడు రేవులోకి వెళ్ళలేదు. ★


